# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విశాఖ నగరంలో మొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కు రాష్ట్ర ఐ.టి. శాఖా మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు.
- ❖ ప్రతి కుటుంబానికి మెరుగైన ఆదాయం, జీవనోపాధి కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.
- ❖ రాష్ట్రంలో 60 వేల కోట్ల రూపాయల విలువైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.
- ❖ మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా విశాఖపట్నం వేదికగా ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది.

=====================

దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ విశాఖకు రాబోతోందని రాష్ట్ర ఐ.టి. శాఖా మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. విశాఖ నగరంలో మొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు మంత్రి ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... 4 జిల్లాలతో శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు గ్రేటర్ విశాఖ ఎకనామిక్ జోన్ ఏర్పాటు చేస్తామని, 2047 నాటికి విశాఖ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుతుందని తెలిపారు. 100 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో 50 శాతం విశాఖకే వస్తున్నాయని పేర్కొన్నారు. విశాఖ నగరంలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి లోకేశ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

మెలియాయిడోసిస్ వ్యాధి లక్షణాలతో గుంటూరు జిల్లా తురకపాలెం గ్రామంలో చనిపోయిన 28 మందికి 5 లక్షల రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం ప్రకటించింది. మృతుల కుటుంబ సభ్యులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ రోజు చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మెలియాయిడోసిస్ వ్యాధి నిర్ధారణకు వైద్య నిపుణులు రక్త నమూనాలు సేకరించి 61 వేల

పరీక్షలు చేశారన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డులలో బాధితులకు చికిత్స అందించామని వివరించారు.

=====================

ప్రతి కుటుంబానికి మెరుగైన ఆదాయం, జీవనోపాధి కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఈ రోజు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆయన మాట్లాడుతూ... అర్హత ఉన్నవారికి ఇళ్ల పట్టాలు, నూతన ఫించన్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పన జరుగుతుందని అన్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో చేడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

=====================

రాష్ట్రంలో 60 వేల కోట్ల రూపాయల విలువైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెంలో కేంద్ర సహాయ మంత్రి ఈరోజు పర్యటించారు. 2 కోట్ల రూపాయల నిధులతో చేపడుతున్న జిల్లా పరిషత్ పాఠశాల భవన పునర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ పాఠశాలలో చదివిన ప్రవాసాంధ్రులు పాఠశాల అభివృద్ధికి నిధులు ఇవ్వడం అభినందనీయమన్నారు. రాష్ట్ర విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకొస్తున్నామని, డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్నారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

=====================

ఈ నెల 16న కర్నూలులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతం చేసేందుకు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులకు సూచించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై నియోజవర్గ అధికారులతో మంత్రి ఈ రోజు సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి సభకు హాజరయ్యే వారికి ఆహారం, తాగునీరు ఏర్పాట్ల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.

=====================

పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఈ నెల 17వ తేదీన జిల్లా యువజనోత్సవాలు నిర్వహిస్తామని కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. 2026 జనవరి 12న వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో యువతకు అనేక అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారు రాష్ట్ర పోటీలకు, అక్కడ గెలుపొందిన వారు ఢిల్లీలో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటారని వివరించారు. జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను తణుకు ఎస్.కే.ఎస్.డి. మహిళా కళాశాలలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

=====================

నైరుతి బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ తమిళనాడు తీరం మీదుగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. రానున్న రెండు రోజుల్లో ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ లో ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అంచనా వేసింది. మరిన్ని వివరాలను వాతావరణ శాఖ అధికారి వెంకటరావు తెలియజేస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

======================

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా భారత్ వెస్టిండీస్ పురుష జట్ల మధ్య జరుగుతున్న రెండవ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో మూడవ రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ రెండవ ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 248 పరుగులకు ఆలౌట్ అయి ఫాలో ఆన్ ఆడుతోంది. భారత్ ఇంకా 97 పరుగుల ఆదిక్యంలో ఉంది.

అదే విధంగా మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా విశాఖపట్నం వేదికగా ఆస్ట్రేలియా భారత్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 39 ఓవర్లు పూర్తయ్యే సరికి 4 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. స్మృతి మంధాన 80 పరుగులు, ప్రతీకా రావల్ 75 పరుగులు చేశారు.

======================
======================